# సాగరమథనం

"ఇంతకన్నా చెడి పోయేది ఇంకేమీ లేదు – ఎవరూ నన్ను ఇంతకన్నా పాడు చెయ్యలేరు" అనుకున్నాడు ప్రసాదరావు.

అట్లా అనుకుందుకు బోలెడంత కారణం వుంది. ఎక్కటానికి ముందు మెట్లు లేనివాడూ, దిగేందుకు వెనక మెట్లు లేని వాడూ నిజంగా అదృష్టవంతుడు. దిగజారి పోగల దురదృష్టం లేకపోగా అనవసరమైన ఆశలు పెట్టుకోడు. జీవితం అంటే యిదా? వేరే ఆనందం యింకేమీ లేదనుకోవటం సబబేనా?

జీవితాన్ని గురించి మనం అవలేశమైనా ఆలోచనే చెయ్యం. కాని అకస్మాత్తుగా అందులో దూకి సాగరమధ్యానికి వెళ్ళిపోయింతర్వాత చికాకుపడతాం, యిదేనా ఆనందం అని...ఛీత్కరించుకొంటాం, పగవాడికన్నా యిన్ని దురవస్థలు రారాదని కోరుకుంటాం. బ్రతుకుతోన్న ప్రతివాడికీ ఏవో సమస్యలు, బుర్రలు బద్దలు చేసుకున్నా అర్థంకాని సమస్యలు, పరిష్కారాలు ఎన్నాళ్ళకీ తెలీని సమస్యలు, దేన్లోనూ విశ్వాసం ఉండదు; వాటిని గురించి ఏమీ నిశ్చయించుకుందుకు వీలుండదు. ఏదీ కంటికి ఎదురుగా కాన రాదు.

ఒక్క సమస్య చాలు జీవితాన్ని పట్టి పల్లార్చేందుకు, అనురాగాలను ఆఖరు మెట్లకు దించేందుకు. ఈ సమస్యల్నీ నిత్యజీవితంలో ఎదుర్కొనేందుకు సరిపడ్డ సామాగ్రి మనం యెక్కడ సంపాదించగలం? – యిదే ఆలోచిస్తాం – అదే పనిగా. కాని కనుచూపు మేరలో పరిష్కార మార్గాలు కనిపించవు. అట్లానే నిరాశతో కాలం దొర్లిస్తోంటాం. జీవితం అంటే పూర్తిగా విరక్తి యేర్పడేంత వరకూ.

జీవితంలో ఒకటే బెంగ – తను యింతకన్నా దమ్మిడీ ఎక్కువ సంపాదించేందుకు సాధనం లేదా అని! ఏదీ కాన రాదు, చాలీ చాలని జీతం, ఇరవైనాలుగంటల సేవ. నోరు మెదిపేందుకు వీల్లేనంత క్రమశిక్షణ, ఎందుకు? వ్యక్తిత్వం లేకపోయింతర్వాత

బ్రతికేం? బ్రతక్కయేం? ఏపని చేసినా తనకోసం కాదు, ఎవరికోసమో. ఎక్కడివాళ్ళకోసమో తన యీ సేవ? ఉదరాలు నింపుకునేందుకే చాలని జీతాలు – తనకోసమే యీ చాకిరీ చేస్తున్నానని ప్రసాదరావు – అతనొక్కడే కాదు, ఆ స్థానంలో ఉన్న యెవరయినా సరే యెట్లా చెప్పగలరు? తమ కోసమే అయితే తన యిష్ట ప్రకారం ఒక్కపనీ చెయ్యలేదేం? తన సంతోషం కోసం ఒక్క క్షణమూ వినియోగించదేం? అంతా ఏమిటో మాయ.

స్వార్థం అంటారు, వేదాంతం చెబుతారు, ''మనిషి'' అన్న ప్రతివాడూ ఎంతో కొంత స్వార్థంతోనే జీవిస్తాడని చెబుతారు. కాని ఈ మాటలు తన మనస్సెట్లా అంగీకరిస్తుంది? నిత్యజీవితం నుంచి కన్నా అనుభవాలు మరెక్కడ దొరుకుతాయి?

తను తీరని ఆశలతో కుళ్ళి చావటం లేదు, ఇంద్రాసనం ఎక్కి భోగాలనుభవించాలని తనకేం కోరికకా దు. రోల్సురాయిస్ కారులో కొత్తరకం సినిమా ఆడతారని వెంటేసుకు బీచికి డ్రైవ్ చెయ్యాలన్నా కోరడు కనీసం. కోరికలన్నీ – అన్నీ యెక్కడ? ఒక్కటే ఒక్కటి – జీవితాని కల్లా యేకైక లక్ష్యం – పరిమిత పరిధిలోనే ఎన్నడో గిరిగీసి అట్టే పెట్టాడు. ఇంతకన్నా ఇంకేమి అక్కరలేదని. కాని ఆ యింత అయినా ఎందుకు లభించదు తనకి? ఎంతవరకు తను బా ధ్యుడు? తన అసమర్థత ఉన్నదా యిందులో?

ఈ జన్మకు జీవితంలో సెటిల్ అయిపోయినాడు తను. గవర్నమెంటులో గుమాస్తా. సుఖంకోసం పెళ్ళి చేసుకున్నాడు. ఎన్ని సుఖాలు పొందినాడో తెలియదు కాని, యిద్దరు పిల్లలు. ఘనమైన ఉద్యోగం చేసి నలుగురిమీదా అధికారం చలాయించాలని తనకేం ఉండదు. ఒక్కటే కోరిక! ఇస్తున్న డెభయినాలుగు చాలదు. దాన్లో జీవితం యేమీలేదు; చిరగని గుడ్డముక్క లేదు; ఖారం అనిపించని దేహావయవంలేదు; బాధపెట్టని వరంలేదు; మనస్సుకు సంతసం లేదు; కష్టాలు లేని క్షణం ఒకటయినా లేదు. చాలదు. కావల్సింది ఉండదు. అక్కర్లేంది కావాలన్న బెంగ అసలే లేదుకదా!

కనీసం తనకి నూటపదిరూపాయలన్నా యిస్తే కాని చాలదు. మళ్ళీ అడుగడు యెవరినీ, యిదికావాలని అదికావాలని. డబ్బుకి ముఖం వాచినట్టు మాట్లాడడు. తన జీవితానికి నెలకు నూటపదిరూపాయలన్నా కావాలి. తప్పదు. అంతే తనకోరిక.

కాని-కాని ఎట్లా తన ఈ ఆశ నెరవేరేది? ఈగ్రేడ్‌లో తనకి నూటపది రిటైరయేనాటిక్కాని రాదు. ఈ క్షణం నుంచి కావాలి తనకు. ఎట్లా?

బాధలు భరిస్తాడు; భయాలు వెనక్కి నెడతాడు; భరించటం చాతకాక బాధపడతాడు; అసహాయుడు – యేమీ చెయ్యలేనివాడు. ఏం చెయ్యాలన్నా అంతరాత్మ అడ్డంపడేవాడు – నీతికి న్యాయానికి మంచికి చెడ్డకి కష్టానికీ నిష్ఠూరానికీ తలవొగ్గి చేతులు కట్టుకు నించునేవాడు – ఏం చెయ్యగలడు తను? ఏమీ చేయలేడా? ఒఠ్ఠి నిరర్థపు బ్రతుకేనా తనది?

తనకి పై గ్రేడ్ గుమాస్తాగిరి యిస్తే సరి. చాలు తనజీవితానికి. అంతకంటే, ఏమని పిలిచినా – నూటపదిరూపాయలు యిస్తే చాలు. తన్ని ఎక్కడ కూచోమన్నా కూచుంటాడు. యేం రాయమన్నా రాస్తాడు.

మనుషుల విజ్ఞాన వికాసాలకి గీటురాళ్ళు ఎక్కడ తయారు చేస్తున్నారు? ఎన్నాళ్ళిట్లా తనకీ అధఃపతనం? విముక్తి ఎప్పటికి? ఈ జీవితంలో తన ఆశ నెరవేరదా?

అర్థంలేని శాసనాలు ఎందుకు చేస్తారో తెలీదు. "టెస్ట్" ప్యాస్ కాని వాళ్ళకి పైగ్రేడ్ యెందుకివ్వరో అర్థం కాదు. "టెస్ట్" పై పనికి యేమీ సంబంధంలేదని వాళ్ళకీ తెలుసు. కాని యిట్లా మనుషుల చేతనాలకీ గీతగీసే అధికారం ఎట్లా సంక్ర మించింది యీ పెద్ద మనుష్యులకి?

ఉహూ. మార్గాంతరం ఏమీలేదు. తనూ శాసనాలకు తలవొగ్గి "టెస్ట్" యేదో ప్యాస్ కాగలగాలి. అప్పుడొస్తుంది తనకీ ప్రమోషను. నూటపదిరూపాయల జీతం, తను కోరుతున్న కామితార్థం. జీవితాన్ని సుగమంచేసుకోగల సాధనం. అంతదాకా తనకి ముక్తి లేదు.

ప్రయోజనం లేనిపని చేసేందుకు అందరూ ముందుకే దారి తీస్తారు. జీవితంలో ఎంతమంది "సక్సీడ్" కాగలుగుతున్నారు? అంతులేని ఆశలు అందర్నీ అసమర్థుల్ని చేస్తున్నాయా? అందరి మాటా ఎందుకు?

తన సంగతేమిటి? తన దుస్థితికి కారణం?

తను మాత్రం ''టెస్ట్'' ఎందుకు ప్యాసవరాదు? ఎవరు అవరోధాలు కల్పించారు తనకి? కాదు, జీవితం యావత్తూ అవరోధాలు. క్షణంపాటు పట్టుమని తను పుస్తకం ముందు కూర్చోగల అవకాశం ఎక్కడుంది?

సూర్యుడుదయించి అస్తమించేంతవరకూ ఎన్నో బాధ్యతలూ, పరసేవాతత్పరత! క్షణం తనదికాదు. ఇందులో తనతప్పేమీలేదు. స్వయంకృత అపరాధాలు యేమీలేవు. కాని యెందుకో తనకే అర్థం కాదు. సార్థక్యం లేని సమయాలని గురించి. రాత్రిపూట ఒకటే బడలిక. ఎక్కువ సేపు మేలుకుంటే ఆరోగ్యం దెబ్బ తింటుంది. ఇప్పుడే అంతంతమాత్రంగా ఉన్నాడా – ఇంకా క్షీణించి యెందుకూ కాకుండాపోతాడు. కూడదు, తనసంగతి ఎట్లా ఉన్నా యీ దుస్థితికి సత్యవతి వొప్పుకోదు. ఏదిదారి?

ఆశయాలకు పూర్తి నిర్వచనం అంతు చిక్కకపోయే చింతనేనా?

ఈ ఉద్యోగం చేస్తో పరిక్షకు చదవటం తనకి సాధ్యం కాదు....ఎప్పటికీ కాదు. ఆచరణీయంగా కనిపించేదీ ఎంత ఆలోచించినా తోచేదీ ఒక్కటే ఒక్కటి. సెలవు పెట్టి శ్రద్ధగా యింటిదగ్గరే చదువు సాగించటం! కాని మళ్ళీ నిరాశ – యేదుపుముఖము!

ఎవరో పూర్వకవి చెప్పినట్లు, ఇసుకలోంచి నూనె తెప్పించవచ్చు, శ్రమపడి కుందేటి కొమ్ము సాధించవచ్చు, కొండమీద కో తుల్ని కిందికి దింపవచ్చు, కాని గవర్నమెంటు ఆఫీసుల్లో సెలవు – ఒకరోజయినా సరే – సాధించగలగటం సాధ్యంకాదు, కేవలం అసాధ్యం. ఎవడో దయామయుడూ – చిన్న ఉద్యోగిగా తనుపడ్డ కష్టాలను అధికార మదావేశ అదేశం వల్ల మర్చిపోనివాడూ – అయిన ఆఫీసరయితే తప్ప దాదాపు అంతామూర్ఖులు. పరాయివాడి అవసరాలు గుర్తించలేనివాళ్ళు, అవతలివాడికి అవకాశం యిస్తే తమకొంప గుండం అయ్యేట్టు బాధపడే వాళ్ళు, కిందివాళ్ళమీద తమకే తెలియకుండా కోపం పుట్టించుకుని శ్రమపడేవాళ్ళు.

అయినా తను ధైర్యం చేసి సెలవు పెట్టి యింట్లో కూర్చున్నాడు. ''స్వంతవ్యవహారాలు'' – అంటే తప్పనిసరిగా తిరిగిరమ్మంటారని – ''ఒంట్లో జబ్బు'' – అని రాశాడు. నిజంగా ఆశ పడ్డాడు యీసారి తన ఆశ అడియాస అవదని.

మూడోనాడు రానే వొచ్చింది పక్కవూరి - ''డి.యం.ఓ.'' - దగ్గరికి వెళ్ళి తన ఒంట్లో జబ్బున్నదని నిర్ధారణ చేయించుకు రావాలిట. ఆ ఫీసులో పని చెయ్యగల భౌతికపరిస్థితి లేదని నిర్ధారణ చేసుకురావాలిట!

కాని రోజులు - చేతిలో కానిలేదు. పక్కవూరి ప్రయాణం - ''డి.యం.ఓ.'' కి ముడుపు - ఇంట్లో కూరలేక నానా అవస్థలు పడుతున్న తనమీదకి ఈ బ్రహ్మాస్త్రం ఒకటి!

రాజశాసనం తప్పేదేముంది? గడ్డికరచి అప్పుచేసి బయలుదేరాడు. ''నీకేమీ జబ్బులేదు, హాయిగావెళ్ళి ఉద్యోగంలోచేరు'' అన్నాడు డి.యం.ఓ. తను చెప్పేది వినడు. గుండెమీద చేయివేసి పరీక్షించడు. తనవేదనకి కారణం తెలుసుకో ప్రయత్నించడు. పైగా నీతివాక్యాలు చెబుతాడు. ''వృద్ధిలోకి రాదగ్గవాడివి. ఎందుకు పెద్దవాళ్ళతో పేచీలు పెట్టుకుంటావు? నిరుద్యోగసమస్య నిప్పులా పాకుతున్న ఈరోజుల్లో ఉన్న ఉద్యోగం కాస్తా ఊడిపోతే యేం చేస్తావు? తగదు నాయనా తగదు వెంటనే జేరు, నన్నాట్టే వాగించకు.''

చివరకు మిగిలిందిదా? అవును అంతే. ఎంతో వేదన పడతాం. ఒకవ్యవస్థని మార్చేందుకు చాలా శ్రమపడతాం - ఓడిపోతాం. చివరకు మిగిలేదీ యీ మనుషులూ మనుషుల తాలూకు పైత్యాలూనూ! వ్రతం చెడుతుందికాని ఫలం దక్కదు.

తనతత్త్వం అంతా ఏమయింది?

ప్రసాదరావూ?------ జీవితంతో పోట్లాడి ఓడిపోయావా? ఒప్పుకుంటావా ఓడిపోయినట్టు? ఏంచేస్తావు? సాహసిస్తావా ? ఎవరికోసం బ్రతికావు యిన్నాళ్ళు? ఎందుకోసం యింత చాకిరి చేశావు? ఎవరు సంతోషించారు నీ సేవకి? ముందయినా అంతేనా? దీపంవెలుతురు ప్రసరించే రోజులు రానేరావా?

ఆలోచించు. కాని ఆలోచించకుండా మాత్రం యే పనీ చెయ్యకు, ❃

*(తెలుగు స్వతంత్ర 12-6-53)*